సాక్షి
చిత్తూరు
శనివారం। 25। నవంబర్। 2023



## ప్రకృతి సేద్యం.. ఆదర్శం

రాష్ట్రంలో ప్రకృతి సేద్యం పద్ధతులు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆ రాష్ట్రాల అధికారులు దీనిపై అధ్యయనానికి వస్తున్నారు. - 10లో



## 5 క్లెయిమ్‌లకు మించితే కేసులు

ఒక వ్యక్తి 5 కంటే ఎక్కువ క్లెయిమ్‌లు నమోదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఈసీ ఆదేశించారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - 10లో



## షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

అండర్-19 షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. - 10లో

## న్యూస్‌రీల్

### చిన్నపిల్లల వార్డుకు ముస్కాన్ అవార్డు

చిత్తూరురూరల్: జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని చిన్న పిల్లల వార్డును ముస్కాన్ అవార్డు వరించింది. ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా ఐదు నెలలకు క్రితం వైద్య ఆరోగ్యశాఖలోని జాతీయ నాణ్యతా ప్రమాణాల విభాగం అధికారులు చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ, ఓపీడీ, చిన్న పిల్లల వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలపై పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలన నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని చిన్న పిల్లల సేవా విభాగం రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ముస్కాన్ అవార్డులను కేంద్రప్రభుత్వం ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపింది. ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ రాజశేఖరరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌లు వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

### కాణిపాకంలో కార్తిక దీపోత్సవం రేపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయానికి అనుబంధ ఆలయాల్లో ఈ నెల 26వ తేదీ కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శుక్రవారం వారు ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ సోమవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం, అనుబంధ ఆలయాలైన మణికంఠేశ్వరస్వామి, వరదరాజుల స్వామి ఆలయాల్లో సోమవారం సాయంత్రం కార్తిక దీపోత్సవం, జ్వాలాతోరణం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

### శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు



విశేషాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధిచేసి, అమ్మవారి గర్భాలయాన్ని మామిడి, వేపాకు, పూలతోరణాలతో ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్యలో రాహుకాల అభిషేక పూజలు చేశారు. ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేయించారు. ఊహించని రీతిలో ఆలయంలో అభిషేక పూజలకు రద్దీ నెలకొంది. ఆలయాధికారులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

### ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా భారతి




ఇన్‌చార్జి వీసీ భారతి

కుప్పం/తిరుపతి సిటీ: కుప్పం ద్రవిడ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్‌గా ఆచార్య డి.భారతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న ఆచార్య తుమ్మల రామకృష్ణ పదవీకాలం శుక్రవారంతో ముగిసింది. ఆయన స్థానంలో పద్మావతీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ భారతిని ద్రవిడ యూనివర్సిటీ ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపారు.

# జీవనోపాధి



బంగారుపాళెం మండలం టేకుమంద వద్ద ఉపాధి పథకంలో తవ్విన ఫారమ్ పాండ్



**వలసల నివారణే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ఇటు కూలీలకు ఆర్థిక తోడ్పాటు.. అటు సమాజ ప్రగతికి దోహదపడుతోంది. స్వచ్ఛత నుంచి అభివృద్ధి..పర్యావరణ పరిరక్షణ.. భూగర్భజలాల వృద్ధి.. భవన నిర్మాణాల వరకు ప్రతి అంశంలోనూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంటోంది. ఫలితంగా పేదలకు జీవనోపాధి కలుగుతోంది.**

- జిల్లాలో ఉపాధి పనులతో ఆర్థిక భరోసా
- రోజూ 4,083 పనులతో 38 వేల మందికి ఉపాధి
- మొత్తం 647 పంచాయతీల్లో పనులు
- ఈ ఏడాది పనిదినాల లక్ష్యం 79 లక్షలు

సాక్షి, చిత్తూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం పరుగులు పెడుతోంది. ఫలితంగా పేదలకు ఆర్థిక భరోసా కలుగుతోంది. గత టీడీపీ హయాంలో ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయి. అందుకు భిన్నంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పారదర్శకంగా పనులు చేపడుతూ గ్రామీణులకు మెరుగైన జీవనానికి బాటలు వేస్తోంది.

#### పేదలకు భరోసా..

నిరుపేదలు ఉపాధి కోసం వలసలు పోకుండా వారున్న ప్రాంతాల్లోనే ఉపాధి పనులు కల్పించి, ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, మిల్క్ సెంటర్లు, బృందావనాల నిర్మాణాలతోపాటు చెరువుల ఆధునికీకరణ, ఫీడర్ కాలువల మరమ్మతు, డ్రైన్స్, రోడ్లకిరువైపులా మొక్కల పెంపకం, ఉద్యాన పంటలకు సంబంధించి గుంతలు, అమృత్ సరోవర్ పథకం ద్వారా భూగర్భజలాల వృద్ధికి చర్యలు, గుర్రపు డెక్క తొలగింపు తదితర పనులు చేపడుతున్నారు.

#### 5 క్లస్టర్లలో పనులు

జిల్లాలోని 31 మండలాలను 5 క్లస్టర్లుగా విభజించి, కూలీలకు రోజూ సుమారు 6 వేల పనులు కల్పిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు పుంగనూరు, సదుం, నగరి, కుప్పంలో భారీగా పనులు చేశారు. అందులో చిత్తూరు క్లస్టర్ పరిధిలో 74 శాతం పూర్తి చేశారు.

#### కూలీలకు మెరుగైన వసతులు

ఉపాధి కూలీలకు అన్ని రకాల మెరుగైన వసతులు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశంలో నీడ, నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనుల్లో పారదర్శకత పెంచింది.

#### 647 పంచాయతీల్లో పనులు

జిల్లాలో మొత్తం 700 పంచాయతీ ఉండగా 647 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది 79 లక్షల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఎనిమిది నెలల్లోనే అధికారులు కూలీలకు 67 లక్షల పనిదినాలు కల్పించి, 85 శాతం లక్ష్యం సాధించారు.

#### ఉద్యానానికి ఉపాధి

జిల్లాలో వివిధ రకాల మొక్కలను నాటేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా మొదట 4 వేల ఎకరాలను ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా జిల్లా అధికారులు దాన్ని 6400 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని భావించారు. ఇప్పటివరకు ఈ ఏడాది 6,411 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయించి, రైతులను ప్రోత్సహిస్తున్నారు.

#### కరవు మండలాల్లో అదనపు పని

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గంగవరం, పలమనేరు, రామకుప్పం, రొంపిచర్ల మండలాలను కరువు మండలాలుగా గుర్తించింది. ఈ మండలాల్లో 50 శాతం అదనంగా పని దినాలను కల్పించేందుకు సమాయత్తమవుతోంది.



యాదమరి మండలంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కేంద్రబృందం

#### 2.06 లక్షల మందికి ఉపాధి

జిల్లాలో మొత్తం 4.05 లక్షల మందికి జాబ్‌కార్డులుండగా ఇప్పటివరకు 2.06 లక్షల మందికి పనులు కల్పించారు. గ్రామాల్లో పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా నూరు రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వారు 6,230 మంది ఉన్నారు. కూలీలకు రోజువారీ వేతనం సగటున రూ.253 అందుతోంది. ఈ ఏడాది ఎనిమిది నెలల్లోనే రూ.255 కోట్లు ఖర్చు చేసి ప్రజల జీవనోపాధి కల్పించారు.

#### గృహ నిర్మాణాల్లో 30.98 లక్షల పనిదినాలు

జిల్లాలో ప్రధానంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ఒక్కొక్క ఇంటికి 90 రోజులు పని కల్పించాల్సి ఉండగా మొత్తంగా 30.98 లక్షల పని దినాలు కల్పించారు. ఇక రోజువారీగా 15 వేల పని దినాలు కల్పిస్తున్నారు. మ్యాజిక్ సోక్‌పిట్‌లకు సంబంధించి ఆరు రోజుల పనిదినాలు లెక్కన 4,600 మందికి పని కల్పించారు.

#### మరిన్ని పనులకు కృషి



నిరంతరం ఉపాధి పనులపై సమీక్షిస్తున్నాం. మరిన్ని ఉపాధి పనులు చేపట్టడానికి కృషి చేస్తున్నాం. మండలానికొక అమృత సరోవర్ కార్యక్రమం చేపట్టి నూతనంగా చెరువులు నిర్మించి, భూగర్భ జలాల వృద్ధికి కృషి చేస్తాం. ఇటీవల కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి, ఉపాధి పనులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసింది.

–షణ్మోహన్ సగిలి, జిల్లా కలెక్టర్, చిత్తూరు,

#### 8 నెలల్లో 85 శాతం లక్ష్యసాధన



రాష్ట్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి 79 లక్షల పని దినాలను లక్ష్యంగా నిర్ణయించింది. ఎనిమిది నెలల్లోనే 85 శాతం లక్ష్యం సాధించాం. అవెన్యూ ప్లాంటేషన్ తోపాటు, హార్టికల్చర్, సిరికల్చర్ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చాం. కరువు మండలాల్లో 50 శాతం అదనంగా ఉపాధి హామీ పనులను కల్పిస్తాం.

– గంగా భవానీ, ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా, చిత్తూరు

#### చాలా వరకు టార్గెట్ పూర్తి



ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించి, వలసలను నివారించడమే లక్ష్యం ముందుకు సాగుతున్నాం. ఒకవైపు ఉపాధి హామీ పనులు చేస్తూ ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమ, పూల తోటల సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. పుంగనూరులో గృహనిర్మాణానికి కూడా ప్రాధాన్యత ఇచ్చాం. టార్గెట్ చాలా వరకు పూర్తి చేశాం.

– నీలిమ, అసిస్టెంట ప్రాజెక్టు డైరెక్టర్, పుంగనూరు క్లస్టర్

#### గృహ నిర్మాణ పనులకు ప్రాధాన్యత



జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణానికి సంబంధించి 31 మండలాల్లో ఇప్పటివరకు ఉపాధి హామీ పథకం కింద 30.98 లక్షల మందికి పని కల్పించాం. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు గృహ నిర్మాణాలను పరిశీలిస్తూ వాటిని వేగవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నాం. ప్రస్తుతం 15 వేల పనిదినాలను కల్పిస్తున్నాం.

–పద్మనాభం, పీడీ, గృహనిర్మాణ శాఖ, చిత్తూరు,

# ఆర్థిక అసమానతల తొలగింపే లక్ష్యం



కృష్ణసముద్రంలో మంత్రి రోజా పల్లెనిద్ర



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: 'రాష్ట్రంలో ఆర్థిక అసమానతల తొలగింపే లక్ష్యంగా జగనన్న పాలన సాగిస్తున్నారు. దట్స్ వై ఏపీ నీడ్స్ జగన్ (అందుకే రాష్ట్రానికి జగనన్న అవసరం).' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు. శుక్రవారం పుత్తూరు మండలం కృష్ణసముద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి రోజా మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో కృష్ణసముద్రం సచివాలయ పరిధిలో అర్హులైన పేదలకు ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాల కింద రూ.14.53 కోట్ల లబ్ధిని అందజేసినట్లు తెలిపారు. అనంతరం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా కృష్ణసముద్రంలోనే మంత్రి రోజా పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే నన్ను ఆశీర్వదించమని అడిగే దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. జగనన్న రాష్ట్రముఖ్యమంత్రిగా సంతకం చేసిన క్షణం నుంచి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు.

**2024లో వన్స్‌మోర్ జగనన్న**

రాష్ట్రానికి సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని, అవి యథావిధిగా అమలు కావాలంటే రానున్న 2024 ఎన్నికల్లో జగనన్న ముఖ్యమంత్రిగా వన్స్‌మోర్ అంటూ ప్రజలు స్వాగతం పలకాల్సిందేనని మంత్రి ఆర్కే రోజా తేల్చి చెప్పారు. అమలవుతున్న అమ్మ ఒడి, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేదోడు, వైఎస్సార్ బీమా, సున్నా వడ్డీ తదితర పలు సంక్షేమ పథకాల లబ్ధితో ప్రతి పేదవాని మోములో ఉన్న చిరునవ్వు శాశ్వతం కావాలంటే జగన్ మళ్లీ రావాల్సిందేనన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తోందని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనికట్టుకుని ప్రచారం చేస్తోందన్నారు. అందుకే జగనన్న చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని రాసిన బోర్డులను గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ప్రతి కుటుంబానికీ మంచి చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నగరి నుంచి తనను మూడోసారి గెలిపించమని కోరారు. ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సర్పంచ్‌లు దయా, కుమార్‌స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏసు, జయపాల్, ప్రభు, వెంకటేశు, షణ్ముగం, వడివేలు, రాజేంద్ర పాల్గొన్నారు.

# క్రీడా రంగానికి తగిన గుర్తింపు



మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, చిత్రంలో పెద్దిరెడ్డి తదితరులు

చౌడేపల్లె: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడారంగానికి వెన్నుదన్నుగా నిలిచి తగిన గుర్తింపు ఇస్తోందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, ఐపీఈ భానుమూర్తి రాజుతో కలిసి చౌడేపల్లెలో 67వ అండర్-17 అంతర్ జిల్లాల బాల, బాలికల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సచివాలయం నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మరింత ప్రోత్సహించి తమదైన శైలిలో రాణించేలా వారిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. గత ప్రభుత్వంలో క్రీడా రంగాన్ని విస్మరించారని, ప్రస్తుతం నాడు-నేడు పథకం ద్వారా క్రీడా ప్రాంగణాలను ఆధునికీకరించడం జరుగుతోందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని కొనియాడారు. అంతకు ముందు క్రీడాపోటీలకు హాజరైన 13 జిల్లాల క్రీడాకారులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. వర్షం కురుస్తున్నా క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో తన క్రమశిక్షణను చాటుకొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైఎస్సార్ సీపీ చిత్తూరు రాజంపేట పార్లమెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, క్రీడల పరిశీలకుడు రామ్‌బాబు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్ వరుణ భరత్, ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు, హెచ్ఎం నాగరాజరెడ్డి పాల్గొన్నారు.

# కబళించిన మృత్యువు

- నారాయణవనం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- రాళ్లకాలువ వంతెన వద్ద కళాశాల బస్సును ఢీకొన్న కారు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం
- ఒకరి పరిస్థితి విషమం



కళాశాల బస్సును ఢీకొన్న కారు

నారాయణవనం : స్థానిక బైపాస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన రమేష్ నాయుడు(60), అతడి భార్య పుష్ప (55), వదిన వనజాక్షి (60), మరో అన్న కుమార్తె భాను (53), తమ్ముడి భార్య శివమ్మ(52) సమీప బంధువుల ఇంట్లో నిశ్చితార్థ వేడుకకు హాజరయ్యేందుకు కారులో తమిళనాడులోని పెరంబూరుకు శుక్రవారం ఉదయం వెళ్లారు. రమేష్‌నాయుడు డ్రైవింగ్‌లోనే కారులో తిరుగుప్రయాణమయ్యారు. నారాయణవనం సమీపంలోని రాళ్లకాలువ వంతెన వద్ద ముందు వెళుతున్న చెరుకు ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోతూ ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేట్ కళాశాల బస్సును ఢీకొన్నాడు. దీంతో రమేష్ నాయుడు, పుష్ప, భాను, వనజాక్షి అక్కడికక్కడే మరణించారు. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో రమేష్‌నాయుడు, పుష్ప మృతదేహాలను అతికష్టం మీద వెలికి తీశారు. వెనుక సీటులో ఉన్న వనజాక్షి మృతదేహం గుర్తు పట్టలేనంతగా నుజ్జు నుజ్జు అయ్యింది. తీవ్రంగా గాయపడిన శివమ్మను 108 వాహనంలో పుత్తూరు ప్రభుత్వాపత్రికి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఇద్దరు విద్యార్థినులకు స్వల్ప గాయాలవడంతో ప్రథమ చికిత్స చేయించి, ఇంటికి పంపినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**తీరని విషాదం**

రమేష్‌నాయుడు కుటుంబం మృత్యువాత పడినట్లు తెలియగానే స్వగ్రామం పరమేశ్వరమంగళంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధుమిత్రులు అధికసంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

**ప్రమాదకరమార్గం**

బైపాస్‌రోడ్డులో సముదాయం క్రాస్ నుంచి రాళ్లకాలువ వరకు సుమారు 2 కిలోమీటర్ల మార్గం అత్యంత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లలో జరిగిన ప్రమాదాల్లో ఓ పోలీ స్ కానిస్టేబుల్‌తో సహా ఆరుగురు మృతి చెందినా భద్రతా చర్యలు తీసుకోలేదని మండిపడుతున్నారు.

## క్లుప్తంగా

### 5 క్లెయిమ్‌లకు మించితే కేసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఒక వ్యక్తి ఐదు కంటే ఎక్కువ క్లెయిమ్‌లు నమోదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. విజయవాడ నుంచి శుక్రవారం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత చేపడుతున్న కసరత్తుపై కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఎపిక్ కార్డును నిబంధనల మేరకు జనరేట్ చేసి పోస్టు ద్వారా పంపాలన్నారు. ఫారం 6, 7, 8 క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఒకే డోర్ నంబర్‌లో 10 మంది ఓటర్లు ఉంటే క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కసరత్తు పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల ప్రచురణ అనంతరం నమోదవుతున్న క్లెయిమ్‌లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో షెడ్యూల్ ప్రకారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారి నుంచే అందే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా, సిబ్బంది ఉమాపతి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### చీటీల వ్యాపారి కిడ్నాప్ కలకలం

వి.కోట: మండలంలో చీటీల వ్యాపారిని గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేశారని మండలంలో కలకలం రేగింది. దీంతో ఆయన వద్ద చీటీలు వేసిన వారు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పాతూరు గ్రామానికి చెందిన సతీష్ గురువారం రాత్రి కారులో వి.కోట నుంచి ఇంటికి వస్తుండగా కారును ఎవరో వెంబడించి, కిడ్నాప్ చేశారని ఆయన భార్య నిర్మల పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆర్థిక లావాదేవీల విషయంలో కిడ్నాప్ అయినట్లు మండలంలో ప్రచారం జరుగుతోంది. ఆయన ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో చీటీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులు, ధనవంతులు అధిక మొత్తంలో చీటీలు వేసినట్లు సమాచారం. దీంతో మండలంలో చీటీలు వేసిన వారంతా లబోదిబోమంటున్నారు. అయితే సాయంత్రం చీటీల వ్యాపారి సతీష్ కర్ణాటక రాష్ట్రం లోని కోలార్‌లో ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని, ప్రస్తుతం ఆయన క్షేమంగా ఉన్నారని తేలింది.

# ఫలించిన సొంతింటి స్వప్నం


ప్రభుత్వం నిర్మిస్తున్న పేదలందరికీ ఇళ్లు

పేదలందరికీ–ఇళ్లు పథకంతో ప్రతి పేదోడి సొంతింటి స్వప్నం ఫలించింది. ఉండేందుకు గూడు లేక ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు అద్దె ఇళ్లల్లో కాపురం ఉండాల్సిన పరిస్థితి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ–ఇళ్లు పథకానికి శ్రీకారం చుట్టారు. అర్హత ఉన్న పేదలకు వైఎస్సార్‌సీపీ సర్కారు ఉచితంగా ఇళ్ల పట్టాలను ఇవ్వడంతో ఇళ్లను కట్టుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలోని పేదోడి సొంతింటి స్వప్నం సాకారం అయ్యింది. సొంతిల్లు నిర్మించుకున్న లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే.. – చిత్తూరు కలెక్టరేట్




#### నా కల నెరవేరింది



నాకు పెళ్లి అయిన నాటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. నా భర్త కూలి పనికి వెళతాడు. మాకు సొంతిల్లు అనేది ఓ కలగా ఉండేది. జగనన్న దయతో నాకు ఇంటి పట్టా ఇచ్చి స్థలం చూపించారు. ఇల్లు కట్టుకోవడానికి డబ్బిచ్చి ప్రోత్సహించారు. రూ.6 వేలు వరకు అద్దె చెల్లిస్తున్న నేను సొంతింటిలోకి కాపురం రావడం జగనన్న మాకు ఇచ్చిన గొప్ప బహుమతి. ప్రభుత్వమే దగ్గరుండి మాతో గృహప్రవేశాలు జరిపించడం నమ్మలేని నిజం. జగనన్న మాకు దేవుడిచ్చిన అన్నగా భావిస్తున్నా. ఆయన రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. ఆయన మళ్లీ సీఎం కావాలన్నదే మా కోరిక. – ఎం. లత, కల్లూరు, వడమాలపేట మండలం

#### ఎంతో ఆనందంగా ఉంది



సొంతిల్లు లేకుండా పేదరికంతో జీవనం గడుపుతూ ఇంటి అద్దె కట్టలేని పరిస్థితుల్లో ఉండేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి స్వీకరించిన వెంటనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చారు. మాలాంటి నిర్భాగ్యులకు సొంతింటి కలను నెరవేర్చారు. ఇది మా ఇల్లు అని చెప్పుకునే ధైర్యాన్ని మాలో నింపారు. సీఎంగా ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాలే మా ఇంటికి ఆర్థిక భరోసాగా ఉన్నాయి. మా కుటుంబం ఎప్పటికీ జగన్‌కు రుణపడి ఉంటుంది. – రాములు, దుర్గాప్రసాద్ దంపతులు, కార్వేటినగరం

#### ప్రభుత్వ ప్రోత్సాహం మరువలేం



జగనన్న ప్రభుత్వంలో ఇల్లు పూర్తి చేసుకోగలిగాను. అధికారులు నిత్యం పర్యవేక్షించారు. ప్రభుత్వం నుంచి ఇసుక, ఇతర సామగ్రి తక్కువ ధరలకు ఇప్పించారు. ఇంటి పట్టా ఇచ్చిన నాటి నుంచి ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు మాకు అండగా నిలిచారు. జగనన్న ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉంది. గతంలో ఏమీ లేని నాకు ప్రస్తుతం రూ.10 లక్షల ఆస్తి చేకూరింది. ఇందుకు జగనన్న ప్రభుత్వమే కారణం. మళ్లీ జగనన్నే సీఎం కావాలి.
– ఎస్.చంద్రలేఖ, ఓటీఆర్ కండ్రిగ, వడమాలపేట మండలం

#### మాట నెరవేర్చారు



మేము కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాం. మాకు సొంతిల్లు కట్టుకునే స్థోమత లేదు. ఇల్లు కట్టుకోవాలంటే అప్పుచేసి, తీర్చే పరిస్థితి. గత ప్రభుత్వంలో ఇంటి కోసం చాలాసార్లు తిరిగాం. ఎవరూ పట్టించుకోనేలేదు. జగనన్న సీఎం కాగానే మాకు యాదమరిలో ఇంటి స్థలంతోపాటు ఇల్లు కట్టుకునేందుకు సహాయం చేశారు. ఇంటి పనులు పూర్తి చేశాం. వారంలో గృహ ప్రవేశం పెట్టుకున్నాం. సొంతింట్లోకి వెళుతున్నామంటే అందుకు కారణం సీఎం సారే. ఆయన మేలును ఎప్పటికీ మరువలేం.
– నర్సీన్, యాదమరి, లబ్ధిదారు

# ప్రకృతి సేద్యం.. ఆదర్శం

- సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అధ్యయనానికి విచ్చేసిన తమిళనాడు బృందం
- పలు రకాల పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న తమిళనాడు బృందం

నగరి : రాష్ట్రంలో పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి రైతులు, అధికారులు రాష్ట్రంలో చేపట్టే వ్యవసాయ విధానాలపై అధ్యయనానికి విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమిళనాడు నుంచి రైతులు, అధికారులతో కూడిన 40 మంది బృందం నగరి పరిసర ప్రాంతాల్లో పర్యటించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం చేసింది. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు, పురుగు మందులకు బదులుగా ప్రకృతిలో దొరికే ఆకుల కషాయాలను వాడి సాగుచేసే పంటలను వారు పరిశీలించారు. విజయపురం మండలం జగన్నాథపురంలో రుక్మిణి అనే రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన జామ తోటతోపాటు అందులో సాగు చేసిన అంతర పంటలను సందర్శించారు. అనంతరం నగరి మండలం టీవీ కండ్రిగలో చెరుకు పంట నూర్పిడి తరువాత కాల్చకుండా మల్చింగ్ విధానాన్ని పాటిస్తున్న లత అనే రైతు నుంచి ఆ విధానంపై వివరాలు సేకరించారు. మల్చింగ్‌తో భూమిలో వానపాములు, సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, తేమ నిల్వ ఉంటుందని, కలుపు నివారణ అవుతుందని, ఆకులు కుళ్లిన తరువాత సేంద్రియ కర్బనం పెరుగుతుందని ఆమె ఆ బృందానికి వివరించారు. మాంగాడు యూనిట్‌కు చెందిన కృష్ణారామపురంలో చంద్రశేఖర్ ప్రకృతి వ్యవసాయ ఎరువుల షాపులో ఉన్న కషాయలు, కోడిగుడ్డు నిమ్మ ద్రావణం, పంచగవ్య, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కంపోస్టు, వేపపిండి, దసపర్ని కషాయం, వేపగింజలు పొడి చేయడానికి వాడే పరికరాన్ని పరిశీలించారు. అనంతరం పొలాల్లో రైతులు నిర్మించుకున్న జీవామృత తొట్టిలను పరిశీలించి, వాటి లాభాలను నమోదు చేసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.వాసు మాట్లాడుతూ జిల్లాలోని 174 పంచాయతీల్లో రైతులు సేంద్రియ పద్ధతులను అవలంబిస్తున్నట్లు తెలిపారు. అధ్యయనం చేసుకున్న విషయాలను, ఇక్కడ అందుతున్న సదుపాయాలతో కూడిన నివేదికను తమిళనాడు ప్రభుత్వానికి అందజేస్తామని తమిళనాడు వ్యవసాయ అధ్యయన బృందం టీమ్ లీడర్ తిలగవతి, సభ్యులు గోపాల్, ప్రసన్న, సురేష్, స్నేహలతతో కూడిన అధ్యయన బృందం తెలిపింది.

# ‘వీక్షిత్ భారత్’ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : వీక్షిత్ భారత్ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వ ఎడ్యుకేషనల్ కన్స్యూమర్ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అధికారి సచీంద్ర కుమార్ పట్నాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వ ఎడ్యుకేషనల్ కన్స్యూమర్ అఫైర్స్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సచీంద్ర కుమార్‌నాయక్ మాట్లాడుతూ వీక్షిత్ భారత్ సంకల్పయాత్రను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో ఇందుకు ప్రత్యేకంగా రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమం పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో 37 మంది జిల్లా అధికారులను నియమించినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో ఆరు వాహనాలు పర్యటిస్తాయన్నారు. ఒక్కొక్క వాహనం రోజూ రెండు గ్రామ పంచాయతీల్లో పర్యటించి, కేంద్ర ప్రభుత్వం తరఫున చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించి ఆ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్‌గా జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ, డీఆర్‌డీఏ పీడీ, సీపీఓ, వ్యవసాయశాఖ అధికారి, తదితర శాఖల అధికారులు సభ్యులుగా నియమించినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు.

**క్షుణ్ణంగా పరిశీలించాలి**

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు దరఖాస్తులను బీఎల్వోలు క్షుణ్ణంగా పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. ఆ తర్వాతనే ఏఈఆర్‌ఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు.

# షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక




రామకుప్పం: అండర్–19 షూటింగ్ బాల్ జిల్లా జట్లు ఎంపిక పోటీలు శుక్రవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 100 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నట్లు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల షూటింగ్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ నరేష్‌బాబు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్‌లో అనంతపురం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర, పీడీలు వెంకటరమణారెడ్డి, ప్రతాప్, జబీర్, వేణు, సుధాకర్, స్వాతి పాల్గొన్నారు.

**బాలుర జట్టు**
మౌనిష్, చరణ్‌తేజ రెడ్డి, అరుణ్ కుమార్, నిఖిల్, పవన్‌కుమార్ నాయక్, మదన్‌కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, ఉదయ్, సుబ్రమణ్యం, భానుతేజ, దుర్గాప్రసాద్, ప్రణీత్ కుమార్, ప్రశాంత్, నవీన్, మదన్.

**ఎంపికైన బాలికల జట్టు**
జయశ్రీ, లహరి, వైష్ణవి, భూమిక, అఖిల, సత్య, జయశ్రీ, సుశ్మిత, బి.అంజలి, అమ్ము, మౌనిష, ప్రియ, ఎస్.అంజలి, అంకిత ఎంపికయ్యారు.

### నేడు వాహనాలు ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వీక్షిత్ భారత్ సంకల్ప్‌యాత్ర ప్రచార వాహనాలను శనివారం ప్రారంభించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని గాంధీ సర్కిల్ నుంచి కలెక్టర్ షణ్మోహన్ ఈ వాహనాలను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

### ఘనంగా ప్రపంచ యాంటీ మైక్రోబియల్ ర్యాలీ

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రపంచ యాంటీ మైక్రోబియల్ వారోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి యాంటీ బయోటిక్ మాత్రల వాడకంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మందులు, మాత్రల వినియోగం, పాటించాల్సిన నియమావళిపై తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు, అధికారులు శిరీష, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల కబడ్డీ ఎంపిక పోటీలు రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సీనియర్ మహిళల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 26న తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షురాలు మమత శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎంపికయ్యే జట్లు ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు కర్నూలు జిల్లా గోనెగొండ్ల మండల కేంద్రంలో నిర్వహించే 70వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారిణులు 75 కేజీల లోపు బరువు ఉండాలన్నారు. ఎలాంటి వయోపరిమితి లేదని, వివరాలకు 9440345455 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# ఖరీదైన బైక్‌ల చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్


బైక్‌ల దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పలమనేరు: బుల్లెట్లు, కేటీఎం, యమహా లాంటి ఖరీదైన బైక్‌లను చాకచక్యంగా చోరీలు చేసే అంతరాష్ట్ర దొంగను పలమనేరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ.15 లక్షలు విలువజేసే 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ చంద్రశేఖర్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. పలమనేరు పట్టణంలో కొన్నాళ్లుగా బైక్‌ల చోరీలు సాగుతున్నందున స్థానిక డీఎస్పీ సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు రెండు క్రైమ్‌పార్టీ బృందాలు కేవలం బైక్ చోరీలపై నిఘా పెట్టాయి. ఈనెల 17వ తేదీన స్థానిక గ్యాస్ ఆఫీస్ ఎదురుగా ఉన్న శంకర ఇంటి ఆవరణలో ఉన్న పల్సర్‌బైక్ చోరీకి గురైంది. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి బైక్‌ను చోరీ చేసిన విషయం బయటపడింది. దీని ఆధారంగా పోలీసులు మండలంలోని తమిళనాడు రాష్ట్ర సరిహద్దు దొమ్మర పాపమ్మ ఆలయం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి పోలీసులను చూసి బైక్‌ను వదలి పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. విచారించగా బైక్ చోరీల విషయం తెలిసింది. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంలోని అరుణాచలనగర్‌కు చెందిన లింగేశ్వరన్ (25) జల్సాలకు అలవాటు పడి, ఖరీదైన బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. దీంతో నిందితున్ని అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరు పరచగా నిందితుడిని రిమాండ్‌కు తరలించాలని జడ్జి ఆదేశించారు. ఇదే కేసులో లింగేశ్వరన్‌కు సాయం చేస్తున్న స్నేహితుడు మౌనిష్‌పై కూడా కేసు నమోదు చేశారు.

**సైడ్‌లాక్‌ను కాళ్లతో తీసి..**

ఖరీదైన బైక్‌ను చోరీ చేయాలని నిర్ణయించుకున్న నిందితుడు ఎవరూ లేని సమయంలో బైక్ వద్దకు వెళ్లి దానిసీటుపై కూర్చొని రెండు కాళ్లతో హ్యాండిల్‌ను తన్నుతూ క్షణాల్లో లాక్‌ను తీసి, ఆపై బైక్‌తో ఉడాయించడం ఇతని ప్రత్యేకత. ఈ విషయం ఓ బైక్ చోరీ జరిగిన ఇంటి ముందున్న సీసీ కెమెరా ఫుటేజీలో కనిపించింది. ఈ కేసును ఛేదించిన క్రైమ్ పార్టీ ఏఎస్‌ఐలు దేవరాజులు, శ్రీనివాసులు, సిబ్బంది అల్లాఉద్దీన్, ప్రకాష్, అశోక్, శీనప్ప, నరేష్ కు రివార్డులు ఇవ్వాలని సిఫారసు చేసినట్లు సీఐ తెలిపారు. ఇందులో ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

**మరో కేసులో ముగ్గురు..**

చిత్తూరు అర్బన్: నగరంలోని ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శిక్షణా డీఎస్పీ పవన్‌కుమార్‌తో కలిసి సీఐ విశ్వనాథరెడ్డి ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. నగరంలోని రీడ్స్‌పేటకు చెందిన దామోదర్ తన కుటుంబ సభ్యులతోకలిసి ఈ ఏడాది ఆగస్టు 25వ తేదీన మదనపల్లెకు వెళ్లారు. ఈ నెల 27వ తేదీ ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి, బీరువాలో ఉన్న 395 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం చిత్తూరు నగరంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎ.నవీన్ (23), ఆర్.శ్రీను, భార్గవి (26)ను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. తిరుపతి నగరం గోపాల్‌రాజు కాలనీకి చెందిన నవీన్, చిత్తూరు నగరంలోని గిరింపేటకు చెందిన ఆర్.శ్రీను చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. చోరీ చేసిన సొమ్మును నవీన్ తన వదిన భార్గవి ద్వారా తిరుపతిలోని రెండు ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టినట్టి గుర్తించారు. నిందితుల వద్ద ఉన్న రూ.2.60 లక్షల విలువ చేసే 52 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. తాకట్టు పెట్టిన నగలను సైతం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.


సీజ్ చేసిన ఆభరణాలు, నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

### పాడి ఆవు చోరీ

గుడిపాల: ఓ పాడి ఆవు చోరీకి గురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని పెద్దదళవాపల్లె క్రాస్ సమీపంలోని రోడ్డు పక్కన పాడి రైతు రమేష్ తన ఇంటి పక్కన ఓ పాడి ఆవును గురువారం రాత్రి కట్టి ఉంచాడు. శుక్రవారం చూడగా ఆవు కనిపించకపోవడంతో దొంగలు చోరీ చేసినట్టు గ్రహించాడు. రూ.50వేల విలువైన ఆవును చోరీ చేశారని గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

### రెండు ఆటోలు ఢీ.. విద్యార్థులకు గాయాలు

పుంగనూరు: రెండు ఆటోలు ఢీకొని పలువురు గాయపడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పుంగనూరు మండలం మోదుగులపల్లెకు చెందిన ప్రయాణికులు, విద్యార్థులు శ్రావణి, జ్ఞానప్రియ, స్వప్న, వాసవి, సింధు పూజగానిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు ఆటోలో బయలుదేరారు. భీమగానిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న పాల ఆటో మితిమీరిన వేగంతో ఢీకొనడంతో విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిని 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాల ఆటోడ్రైవర్ పరమశివంపై పోలీసులు కేసు నమోదు చేశారు.